క్లుప్తంగా

స్కిప్పింగ్ రోప్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పామర్రు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిప్పింగ్ రోప్ విభాగంలో తమ హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారని ఆసీస్సీ హైస్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ వలసా సబాస్టియన్ తెలిపారు. స్థానిక విజయవాడ రోడ్డులోని ఆసీస్సీ హైస్కూల్లో విజేతలైన విద్యార్థులను బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అండర్–14 విభాగంలో ఈవెంట్ డబుల్ అండర్‌లో ఎస్.ఉదయ్‌కిరణ్, అండర్–14 ఈవెంట్ ఫ్రీస్టైల్‌లో జీ ఆదర్శ, జీ మహిత జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచారన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

ముదినేపల్లి రూరల్: రాబోయే రబీ సీజన్‌లో సాగు చేసే మినుము పైరుకు సంబంధించి రైతులు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని ఏఓ బి.వేణుమాధవ్ అన్నారు. మండలంలోని అల్లూరు, బొమ్మినంపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మినుము పైరుకు సంబంధించి పంటల బీమా ప్రీమియం రైతులు చెల్లించుకోవాలన్నారు. ఎకరానికి రూ.60 వంతున ప్రీమియం చెల్లించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ పాల్గొన్నారు.

టెన్నికాయిట్‌లో కానుకొల్లు విద్యార్థుల ప్రతిభ



మండవల్లి: టెన్నికాయిట్ రాష్ట్ర స్థాయి పోటీలకు కానుకొల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎన్‌వై మాధవకుమార్ బుధవారం పేర్కొన్నారు. ఈ నెల 5వ తేదీన గూడూరు హైస్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో కానుకొల్లు విద్యార్థులు ప్రతిభ చూపడంతో సీనియర్ బాలుర విభాగంలో జి.నాగసాయి, జి.మోహనశశి సీనియర్ బాలికల విభాగంలో రుక్మిణీదేవి, సౌమ్యకీర్తి జూనియర్ విభాగంలో కృష్ణవంశీ, ఎల్.నవదీప్, బాలికల విభాగంలో కావ్యను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారని పేర్కొన్నారు.

అన్న సమారాధన

మొవ్వ: స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం శివాలయంలో కార్తిక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో కార్తీక దామోదరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. వాసవీ క్లబ్ మొవ్వ ప్రెసిడెంట్ జగదీష్‌కృష్ణ, ఆర్యవైశ్య సంఘం మండల ప్రెసిడెంట్ జగన్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ పోటీల్లో విద్యార్థికి కాంస్య పతకం



గుడివాడరూరల్: రాష్ట్ర స్థాయి అండర్–14 బాస్కెట్ బాల్ పోటీల్లో గుడివాడ మాంటిస్సోరీ పాఠశాల విద్యార్థి రాకేష్ వీరమాధవ్ కాంస్య పతకాన్ని సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం పద్మావతి బుధవారం తెలిపారు. పల్నాడుజిల్లా నర్సారావుపేట హైస్కూల్లో ఈ నెల రెండు నుంచి 4వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారని పేర్కొన్నారు. ఈపోటీల్లో తమ పాఠశాలకు చెందిన జి.రాకేష్ వీరమాధవ్ ప్రతిభ కనబర్చి జట్టుకు కాంస్య పతకం సాధించాడని తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

నందివాడ: రుద్రాపాక గ్రామ శివారు గోపాలపురం ఊరి బయట అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని మంగళవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసు తెలిపారు. అతని దగ్గర నుంచి 35 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు.

పుస్తకావిష్కరణ



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ కళాశాల ఫార్మకాగ్నసీ విభాగ హెచ్‌ఓడీ డాక్టర్ పి.రవీష రచించిన పుస్తకాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. 'ఎ షార్ట్ గైడ్ టు క్లినికల్ ఫార్మకోకైనటిక్స్' అనే అంశంపై పుస్తకాన్ని డాక్టర్ రవీష రచించారని డాక్టర్ లక్ష్మణరావు తెలిపారు. ఈ పుస్తకంలో ఒక ఔషధం మన శరీరంలో ప్రవేశించాక అది పని చేయు విధానాన్ని తెలియజేశారని చెప్పారు. డాక్టర్ రవీషను అధ్యాపకులు అభినందించారు.

వరికోత యంత్రాలతో అన్నదాతకు మేలు

- ఎకరం కోతకు రూ.3,200
- కూలీలతో ఎకరాకు రూ.18 వేల ఖర్చు



రైతు చేతికి అందిన ధాన్యం



వరి కోస్తున్న యంత్రం

గుడ్లవల్లేరు: వరికోత యంత్రాలతో రైతులు మేలు చేకూరుతోంది. ఖరీఫ్‌లో 1224, బీపీటీ వంటి స్వల్పకాలిక రకాల వరి పంట కోత దశకు వచ్చింది. ఈ నేపథ్యంలో వరి కోసేందుకు యంత్రాలు(హార్వెస్టర్లు) పల్లెలకు తరలి వస్తున్నాయి. గుడ్లవల్లేరు మండలంలోని వేమవరం, కొతవరం, ఉలవలపూడి, బలరామపురం ప్రాంతాల్లో వరి కోత యంత్రాలతో రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. ఈ యంత్ర యజమానులు ఎకరానికి రూ.3,200తో అందుబాటులోకి తెచ్చి వరిని కోస్తున్నారు. కూలీలతో అయితే వరి కోత, పనలు తిరగేయటం, కట్టేత, కుప్ప నూర్పిళ్లతో సహా రూ.18 వేల నుంచి రూ.20వేల ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. యంత్రాలతో కోశాక ధాన్యాన్ని బస్తాల్లోకి ఎత్తుకుని రైతు గూటికి చేర్చుకోవటమేనని అంటున్నారు. మినుము సాగుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యంత్రాలతో కోతలు అయ్యాక చేలను ట్రాక్టర్లతో దమ్ములు చేయిస్తున్నారు. వెంటనే అపరాలను చల్లేస్తున్నారు.

ఎకరానికి రూ.3,200



వరికోత యంత్రాల యజమానులు వరిని కోసేందుకు రూ.3,200 చొప్పున ఎకరానికి తీసుకుంటున్నారు. గంటన్నరలో ఎకరం వరికోత పూర్తవుతుంది. ఎకరానికి కూలీలతో అయితే కోతకు, కట్టేత, నూర్పిడి, పోతకు రూ.18 వేల వరకూ ఖర్చవుతుంది. అతి తక్కువ ఖర్చుతోనే హార్వెస్టర్‌తో పనులు పూర్తవుతున్నాయి.

– పామర్తి అశోక్, ఉలవలపూడి రైతు, గుడ్లవల్లేరు మండలం

పచ్చి మీద బస్తా రూ.1,500



హార్వెస్టర్‌తో కోస్తే పచ్చి మీద బస్తా 1224రకం ధాన్యం రూ.1,500కే కొనుగోలు చేస్తారు. అదే ఆరబెడితే బస్తాకు మరొక రూ.200 అదనంగా రూ.1,700 వస్తుంది. ఆలస్యంగా చేతికి వచ్చే 1318రకం ధాన్యం ఆరబెట్టాకైనా...బస్తాకు రూ.1,550లే వస్తుంది. ఎకరానికి 30–35బస్తాలు దిగుబడులు వచ్చే అవకాశం ఉంది.

– ఎండీ యాసిన్, బలరామపురం రైతు, గుడ్లవల్లేరు మండలం

బస్తాల్లోకి ఎత్తుకోవటమే



వరికోత కోశాక బస్తాలకు ఎత్తుకునే విధంగా వరికోత యంత్రం కోతను కోసి, నూర్చి, ధాన్యాన్ని బయటకు పోస్తుంది. 25 ఎకరాల వ్యవసాయం చేస్తున్నా. అందులో 1224 రకం వరి విత్తనం తొందరగా కోతకు రావటంతో హార్వెస్టర్లతో కోయిస్తున్నా. 1318 రకం పంట ఇంకా చేతికి రావడానికి 25 రోజులు పడుతుంది.

– మహ్మద్ ఇసాక్, వేమవరప్పాలెం రైతు, గుడ్లవల్లేరు మండలం

పశుగ్రాసం కొరత



యంత్రాల ద్వారా కోసిన వరికోతల కారణంగా గడ్డి వచ్చే అవకాశం ఉండదు. దీని వలన పశుగ్రాసం కొరత ఏర్పడే అవకాశం ఉంది. పశువులకు బయట నుంచి గడ్డిని కొనుగోలు చేసుకోవాల్సి వస్తుంది. వరికోత యంత్రాలతో కోసిన గడ్డిని దమ్ముల్లోనే చల్లుకుంటే మినుములో మంచి దిగుబడులు వస్తాయి.

– ఎల్.సునీల్, గుడ్లవల్లేరు ఏఓ

ఉత్సవాలు విజయవంతం చేయాలి



ఉత్సవాల పనులకు రాటను పాతుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

ముదినేపల్లి రూరల్: భక్తుల ఆరాధ్య దైవం శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షిక కల్యాణోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లో శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షిక కల్యాణోత్సవాలు వచ్చే నెల 6 నుంచి 18 వరకు 13 రోజులు వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఉత్సవ పనులకు ఎమ్మెల్యే బుధవారం రాటను పాతి శ్రీకారం చుట్టారు. సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మండలంలోని బొమ్మినంపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. వ్యవసాయాధికారి వేణుమాధవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వీరమల్లు నరసింహారావు, ఎన్డీయే నాయకులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 49 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గుడివాడరూరల్: క్యాంపస్ ఇంటర్వ్యూల్లో తమ విద్యార్థులు 49మంది ఉద్యోగాలు సాధించినట్లు వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్‌వీ ప్రసాదరావు తెలిపారు. తమ కళాశాల్లో బుధవారం బెంగళూరుకి చెందిన స్కిల్ ఇంటర్న్ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్‌ఆర్ మేనేజర్ సంఘవి బీటెక్ చివరి సంవత్సర విద్యార్థులకు క్యాంపస్ ఎంపికలు చేపట్టారని పేర్కొన్నారు. మొత్తం 160మంది విద్యార్థులు పాల్గొనగా ఎలక్ట్రానిక్స్ విభాగం నుంచి 16మంది, కంప్యూటర్ బ్రాంచ్ నుంచి 31మంది, మెకానికల్ నుంచి ఒకరు, ఎంబీఏ నుంచి ఒకరు మొత్తం 49 మంది ఎంపికయ్యారని తెలిపారు. వీరి వార్షిక వేతనం రూ.4.20 లక్షలుగా కంపెనీ మేనేజర్ నియామక పత్రాలు అందజేశారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి.కల్యాణ్‌కుమార్, ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎన్.నవీన్, ట్రైనింగ్ ఆఫీసర్ ఎస్.ధనుంజయరావు అభినందించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

భూ సంబంధిత సమస్యలు పరిష్కరిస్తాం

గుడ్లవల్లేరు: భూ సంబంధిత సమస్యలను పరిష్కరిస్తామని మండల సర్వేయర్ పర్వీన్ సుల్తానా అన్నారు. మండలంలోని శేరీ కల్వపూడిలో రీసర్వే బుధవారం గ్రామసభను నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కొత్తూరి వెంకటలక్ష్మి, పోలిమెట్ల మాజీ మాజీ సర్పంచ్ ప్రసాద్, టీడీపీ నేత శ్రీధర్ పాల్గొన్నారు.

రీసర్వే సభలను సద్వినియోగం చేసుకోవాలి

యలమర్రు(పెదపారుపూడి): గ్రామాల్లో నిర్వహించే రీసర్వే గ్రామసభ ద్వారా రైతుల భూ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని తహసీల్దార్ వై.రంగారావు అన్నారు. మండలంలోని యలమర్రు పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం రీసర్వేపై గ్రామ సభలు నిర్వహించారు. మండల రీసర్వే డీటీ సుందరరావు, పంచాయతీ కార్యదర్శి చైతన్య శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక వన సమారాధన

ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సన్నిధి నాగసాయి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా చీదెళ్ల సుబ్రహ్మణ్యేశ్వరరావును ఎంపిక చేశారు. సంఘ నేతలు మాడుగుల పూర్ణచంద్రరావు, పద్మనాభుని నరసింహమూర్తి పాల్గొన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

కైకలూరు: మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కైకలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సీఐ రమేష్ హెచ్చరించారు. బుధవారం నిర్వహించిన దాడుల్లో ముదినేపల్లి మండలం పెదగొన్నూరులో వి.నాగేశ్వరరావు నుంచి 10 సీసాలు, కైకలూరు మండలం జంగంపాడు శివారు పల్లెపాలెంలో మైలా వేంకటేశ్వరరావు నుంచి 14 మద్యం సీసాలను బెల్టు షాపుల నుంచి స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు పి.ఆదినారాయణ, ఎ.అలీం, హెడ్ కానిస్టేబుల్ కుటుంబరావు, కానిస్టేబుల్ జి.భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొడాలి సురేష్ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టి.విజయసారథి బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

ప్రజామోదంతోనే ఉపాధి పనుల నిర్వహణ

గుడ్లవల్లేరు: ప్రజల ఆమోదంతోనే ఉపాధి హామీ పథకం కింద నిర్వహించబోయే పనులను చేయనున్నట్లు ఉలవలపూడి గ్రామ సర్పంచ్ పామర్తి కన్య భాస్కరరావు తెలిపారు. ఉపాధి ఏపీఓ పి.రాంప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం ఉలవలపూడితో పాటు గుడ్లవల్లేరు మండలంలోని డోకిపర్రు, గాదేపూడి, మామిడికోళ్ల, వేమవరం, వెణుతురుమిల్లి గ్రామాల్లో ఉపాధి పనులపై గ్రామ సభలను నిర్వహించారు.

హుండీ ఆదాయం రూ.20,5,437

కైకలూరు: కైకలూరు శ్యామలాంబ అమ్మవారి దేవస్థాన హుండీ కానుకల ఆదాయాన్ని ఆలయం వద్ద బుధవారం లెక్కించారు. 46 రోజులకు గాను భక్తులు సమర్పించిన ఆదాయం రూ.20,5,437 వచ్చిందని ఈఓ వీఎన్‌కే శేఖర్ తెలిపారు.

శ్మశాన వాటికను అభివృద్ధి పరుస్తాం

కైకలూరు: దళితుల మనోభావాలను గౌరవించే విధంగా కైకలూరు కరకట్టన క్రైస్తవ శ్మశాన వాటికను అభివృద్ధి పరుస్తామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ హామీ ఇచ్చారు. శ్మశాన వాటిక సమీపంలో చెత్తను గుట్టలుగా పేర్చడం వలన సమాధులకు ఇబ్బంది కలుగుతుందని క్రైస్తవ పెద్దలు కామినేనికి ఇటీవల వినతిపత్రం అందించారు. దీంతో రెవెన్యూ, పంచాయతీ అధికారులతో కలిసి శ్మశాన వాటికను బుధవారం పరిశీలించారు. కైకలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి అధ్యక్షతన ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. క్రైస్తవులకు ఇబ్బంది లేకుండా శ్మశాన వాటిక ప్రహరీ, బరంతు చేయిస్తామన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ నవరత్నకుమారి, కూటమి నేతలు వీరాబత్తిన సుధా, కొల్లి బాబీ, క్రైస్తవ సంఘ నేతలు దండే రవిప్రకాష్, జాన్ మిల్టన్, ఆనంద్, పాట్రిక్‌పాల్, జేమ్స్, కిషోర్, ఇన్‌చార్జి తహసీల్దారు ఎండీ.ఇబ్రహీం పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ చెక్కుల అందజేత

కైకలూరు క్యాంపు కార్యాలయం వద్ద సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కామినేని పంపిణీ చేశారు. కైకలూరుకు చెందిన గుడివాడ వెంకట సాయి సుబ్రహ్మణ్యం రూ.75,000, కలిదిండి మండలం కొళ్లపాలెం గ్రామానికి చెందిన మర్రివాడ రమేష్‌కు రూ.1,18,881 చెక్కులు అందజేశారు.

రోడ్డు మరమ్మతులకు రైతుల విరాళాలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని వైవాక నుంచి కొచ్చెర్ల వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి మరమ్మతు పనులకు పరిసర ఆక్వా రైతులు విరాళాలు అందజేశారు. ఈ రహదారిలో ఆక్వా చెరువుల పనులకు వెళ్లడానికి వ్యవసాయ కార్మికులు రైతులు, నేతలు అగచాట్లు పడాల్సి వస్తుంది. ద్విచక్ర వాహనాలు సైతం ప్రయాణించేందుకు వీలులేని విధంగా రహదారి మారింది. దీంతో ఆక్వారైతులు రహదారి మరమ్మతులకు రూ.10 లక్షలు విరాళాలు సేకరించి మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు.

ఎస్ఏ-2 పరీక్షలకు 5,190 మంది విద్యార్థులు

కూచిపూడి(మొవ్వ): ఈ నెల ఎనిమిదో తేదీ వరకు జరిగే సెల్ఫ్ అసెస్మెంట్(ఎస్ఏ-2) మోడల్ పేపర్-2 పరీక్షలకు మండల పరిధిలో 5,190 మంది విద్యార్థులు రాస్తున్నారని ఎంఈఓ–2 కే శ్రీలక్ష్మి తెలిపారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు జరిగే ఈ పరీక్షలు మండలంలోని 58 మండల, జిల్లా పరిషత్ ఎయిడెడ్ యాజమాన్యాల పాఠశాలల్లో, 12 ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం ప్రారంభమైనట్లు ఆమె పేర్కొన్నారు.

పరీక్షలు సక్రమంగా నిర్వహించాలి

ముదినేపల్లి రూరల్: విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు నిర్వహిస్తున్న ఎస్ఏ-2 పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని ఎంఈఓ కె.నరేష్‌కుమార్ అన్నారు. ఈ పరీక్షలు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ప్రారంభమయ్యాయి. వడాలి జెడ్పీ హైస్కూల్లో పరీక్ష కేంద్రాన్ని ఎంఈఓ పరిశీలించారు. ఉపాధ్యాయుడు సీహెచ్ నాగమల్లేశ్వరరావు పరీక్షల నిర్వహణ తీరును ఎంఈఓకు వివరించారు.

వినతిపత్రాల స్వీకరణ

మండవల్లి: మండవల్లిలో బుధవారం రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ మెండా ఝాన్సీ గ్రామసభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గ్రామసభలో లబ్ధిదారులు అందజేసిన వినతి పత్రాలను రెవెన్యూ అధికారులు స్వీకరించారు. తహసీల్దార్ కె.గోపాల్, రీ సర్వే డీటీ సుధారాణి, సర్వేయర్ రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు మృతదేహాన్ని తీసుకెళ్లాలంటే నరకమే



మృతదేహాన్ని పంట పొలాల మధ్య నుంచి తీసుకెళుతున్న కుటుంబ సభ్యులు

జమిదింటకుర్రు(పెదపారుపూడి): పెదపారుపూడి మండలంలోని జమిదింటకుర్రు గ్రామంలో పంట పొలాల మధ్య ఉన్న ఎస్సీ శ్మశాన వాటికకు మృతదేహాన్ని తీసుకుని వెళ్లాలంటే నరకం కనిపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన గంటా జయరాణి(32) బుధవారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని గ్రామంలో ఉన్న ఎస్సీ శ్మశాన వాటికకు తరలించాలంటే తీవ్ర ఇబ్బందులు పడ్డామని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వరి పొలాల మధ్య నుంచి శవాన్ని తీసుకెళుతుంటే విష సర్పాలు తిరుగుతుంటే తీవ్ర ఆందోళనకు గురైనట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, స్పందించి శ్మశాన వాటికకు స్థలం చూపించాలని, దానికి రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్ పుణుకొల్లు శివరామప్రసాద్, గ్రామస్తులు కోరారు.

జమీల్‌కు అభినందనలు



జమీల్ పాడిన పాటల సీడీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య

కైకలూరు: వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారిపై స్వయంగా పాటలు రచించి, గానం చేసిన కైకలూరు విద్యాంజలి విద్యాసంస్థల అధినేత సయ్యద్ జమీల్ అహ్మద్‌ను పలువురు ఆర్య వైశ్యులు అభినందించారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య చేతుల మీదుగా జగ్గయ్యపేటలో ఎమ్మెల్యే నివాసం వద్ద పాటల సీడీని బుధవారం ఆవిష్కరించారు. అనంతరం జమీల్‌ను ఎమ్మెల్యే తాతయ్య సన్మానించారు. కార్యక్రమంలో కైకలూరు ప్రముఖులు పైడిమర్రి జయశ్యామల మాల్యాద్రి, ఈదా వెంకటస్వామి, గడిదేసి విజయ్‌కుమార్, కనిశెట్టి శ్యామ్ పాల్గొన్నారు.

మద్యం దుకాణ ఏర్పాట్లను అడ్డుకున్న మహిళలు



దోకిపర్రులో మద్యం దుకాణ ఏర్పాట్లను అడ్డుకుని ధర్నా చేస్తున్న మహిళలు

గుడ్లవల్లేరు: డోకిపర్రు జగనన్న కాలనీలో మద్యం దుకాణాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. ఆ ఏర్పాట్లను బుధవారం స్థానిక మహిళలు అడ్డుకున్నారు. అనంతరం దుకాణాన్ని ఇక్కడి నుంచి తొలగించాలని ధర్నా చేశారు. సీపీఎం మండల నాయకుడు బి.వి.శ్రీనివాసరరావు మాట్లాడుతూ నివాసాల మధ్యలో మద్యం దుకాణం ఎలా పెడతారన్నారు. సీపీఎం గ్రామ నాయకుడు పెదపూడి కోటేశ్వరరావు మాట్లాడుతూ వైన్ షాపు ఇక్కడి నుంచి తొలగించే వరకూ దుకాణ ఏర్పాట్లను అడ్డుకుంటూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో జువ్వనపూడి సునీత, రాజు, పద్మ, కలపాల రాణి, సందోలు కవిత, జుజ్జువరపు పద్మ, చిలకా అంజమ్మ, మన్నే జ్యోతి తదితరులు పాల్గొన్నారు. అలాగే గుడ్లవల్లేరులో ఏర్పాటు చేయబోయే మద్యం దుకాణం తొలగించాలంటూ తహసీల్దార్ బి.లోకరాజుకు నీలకంఠేశ్వరపుర వాసులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు పిడుగు దేవసహాయం, బీఎస్పీ నాయకులు పాపారావు, శత్రుఘ్నుడు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

గుడివాడరూరల్: పట్టణంలోని ఎస్పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం డీఎంఈ రాణి బుధవారం తెలిపారు. కాణిపాకంలో అక్టోబర్ 25 నుంచి 27వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన తుపాకుల తిమోతి, ఆసిఫ్‌ఖాన్, జయసూర్యతేజ ప్రతిభకనబర్చారని పేర్కొన్నారు. అదేవిధంగా ఈ నెల రెండు నుంచి 4వ తేదీ వరకు అనకాపల్లి జిల్లా తుమ్మపాలనందు జరిగిన ఖోఖో పోటీల్లో పాఠశాల నుంచి జిల్లా జట్టుకు ఆడిన డి.రాకేష్, షాజిత్‌ఖాన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. విజేతలను గుడివాడ డీవైఈఓ ఐ.పద్మరాణి, డీసీబీ చైర్మన్ జాన్‌సాహెబ్, జిల్లా ఖోఖో సంఘం చీఫ్ పార్టనర్ కె.అవినాష్, ఖోఖో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, ప్రసాద్ అభినందించారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాదరావు

గుడివాడరూరల్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గుడివాడ ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాదరావు సూచించారు. పట్టణంలోని పలు చోట్ల జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంవల్ల కలిగే ఉపయోగాలపై బుధవారం ఆయన వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. ఎవరైనా వాహనాలు ఇచ్చినట్లు తమకు తెలిస్తే సంబంధిత వాహనదారులు, తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గుడివాడరూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ ఎస్.చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని వలివర్తిపాడు బైపాస్‌రోడ్డు సమీపంలో బుధవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా లైసెన్సులు, రికార్డులు కలిగి ఉండాలన్నారు.

రేపు కొండలమ్మకు విశేషాభిషేకాలు

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం విశేషాభిషేకాలను పండితులు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఆకుల కొండలరావు బుధవారం తెలిపారు. అనంతరం వివిధరకాల పుష్పాలతో అమ్మవారికి వేదమంత్రోచ్చరణ నడుమ విశేషార్చనను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం కొండలమ్మకు పంచహారతుల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమన్వయంతో విధులు నిర్వహించాలి



పామర్రు మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

పామర్రు: అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులను కలుపుకుని సమన్వయంతో విధులు నిర్వహించాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వ సభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉన్న ప్రజా ప్రతినిధులను కలుసుకుని స్థానిక సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

మొవ్వ: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేసి గ్రామాలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మొవ్వ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో అయ్యంకి నుంచి మొవ్వ శిథిలమైన ఆర్‌అండ్‌బీ రోడ్డును రూ.కోటితో అభివృద్ధి పరుస్తున్నామని తెలిపారు. ఎంపీపీ కొండేటి ఇందిర అధ్యక్షతన జరిగిన ఈ సభలో జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు పరిశుద్ధ రాజు, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు అప్పికట్ల ఇమ్మానియేల్, ఎంపీడీఓ విమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలి

గుడివాడరూరల్: పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను సిబ్బంది బాధ్యతతో నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని నెహ్రూచౌక్, రాజేంద్రనగర్, కోతిబొమ్మ సెంటర్, బంటుమిల్లిరోడ్ తదితర ప్రాంతాల్లో బుధవారం శానిటేషన్ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్‌ను పిచికారీ చేయించారు. ఏలూరురోడ్, పాత, కొత్త మున్సిపల్ కార్యాలయాల వద్ద ఉన్న టిఫిన్ సెంటర్లను తనిఖీ చేశారు. టిఫిన్ సెంటర్లలో పారిశుద్ధ్య నిర్వహణను కచ్చితంగా నిర్వహించాలన్నారు. సూపర్‌వైజర్లు, అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

దారిని ఎందుకు పూడ్చారని అడిగినందుకు దాడి

గుడివాడరూరల్: చేపల చెరువుకు వెళ్లేదారిని ఎందుకు పూడ్చారని అడిగినందుకు ఓ వ్యక్తితోపాటు అతడి భార్యపై దాడి చేశారని బాధితుడు గుడివాడ తాలూకా పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం మేరకు మండలంలోని గుంటాకోడూరుకు చెందిన నాగేశ్వరరావు మోటూరులో నాలుగు ఎకరాల చేపల చెరువును లీజుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఈ నెల 4వ తేదీన నాగేశ్వరరావు చెరువుకు వెళ్లే దారిని సరిహద్దులో ఉన్న రైతు గోళ్ల రామకృష్ణ పొక్లెయిన్‌తో తీసివేయిస్తుండగా నాగేశ్వరరావు ఇదేంటని ప్రశ్నించాడు. దీంతో రామకృష్ణ నాగేశ్వరరావుపై దాడి చేశాడు. దాడిని అడ్డుకునేందుకు వెళ్లిన నాగేశ్వరరావు భార్య నాగశిరోమణిపై కూడా కర్రతో దాడి చేశాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎస్.చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.